సాక్షి నిర్మల్

సోమవారం । 12 । మే । 2025

దారి కాచిన మృత్యువు!



నిర్మల్ బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని కారు డ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తండ్రి, కూతురు దుర్మరణం చెందారు. 8లో▸



సంత.. సమస్యల చింత

కుభీర్ విఠలేశ్వరస్వామి ఆలయం నుంచి బస్టాండ్ వరకు రోడ్డుపైనే వారసంత నిర్వహిస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

అడెల్లిలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రమైంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఉదయం 5గంటలకు అమ్మవారికి అలంకరణ, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని వసతులు కల్పించారు.

కొండుకూర్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. మట్టికుండల్లో బోనం వండి మోదుగ ఆకుల్లో పోచమ్మకు నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

మురళీనాయక్‌కు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో యువకులు

ఖానాపూర్: భారత్–పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు మండలంలోని ఇక్బాల్‌పూర్‌లో నివాళులర్పించారు. ఆదివారం రాత్రి యువకులు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. 'మురళీనాయక్ అమర్ రహే' అంటూ నినదించారు.

'పాకిస్తాన్‌పై యుద్ధం కొనసాగించాలి'

ఖానాపూర్: కాల్పుల విరమణను ఉల్లంఘించిన పాకిస్తాన్‌పై యుద్ధాన్ని తిరిగి కొనసాగించాలని మాజీ సైనికుడు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఖానాపూర్ పట్టణాధ్యక్షుడు షౌకత్ పాషా కోరారు. ఆదివారం ఖానాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్ తీరుతో ఇప్పటికే 26 మంది పర్యాటకులతోపాటు పలువురు సైనికులు వీరమరణం పొందారని పేర్కొన్నారు. సొరంగాల నుంచి బయటకు తీసిన మిస్సైల్స్, యుద్ధనౌకలు, విమానాలను వెనుకకు తిప్పకుండా పాకిస్తాన్‌పై యుద్ధం కొనసాగించడమే శాశ్వతమైన పరిష్కారమన్నారు. 24 ఏళ్ల ఉద్యోగ కాలంలో 8 ఏళ్ల పాటు కశ్మీర్‌లో పనిచేశానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో యుద్ధమే వీర సైనికులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

నిర్మల్‌లో ప్రత్యేక కౌంటర్

నిర్మల్‌టౌన్: రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ ప్రతులను అందించేందుకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న పత్రాలను కార్యాలయంలో ఇవ్వనివారికి ఈ అవకాశం కల్పించారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ధ్రువపత్రాలు అందించాలని, లేనిపక్షంలో అనర్హులుగా గుర్తిస్తామని పేర్కొన్నారు.



దేగాం వద్ద భైంసా–బాసర రహదారి ఇలా..

విస్తరణపై ఆశలు

- నేషనల్ హైవేలపై తరచూ ప్రమాదాలు
- ఏళ్లుగా వినిపిస్తున్న ఫోర్‌లేన్ డిమాండ్
- రెండుసార్లు కేంద్రమంత్రి గడ్కరీకి వినతి
- గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్న ఎమ్మెల్యే పటేల్
- హర్షం వ్యక్తంజేస్తున్న జిల్లా ప్రజలు



వానల్‌పాడ్ వద్ద బాసర–భైంసా రహదారి

భైంసా: జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న ఎన్‌హెచ్–161బీబీ, జిల్లాలో పొడవైన ఎన్‌హెచ్–61 రహదారుల విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి. వీటి విస్తరణతోపాటు భైంసా–బాసర రహదారిని ఫోర్‌లేన్‌గా అభివృద్ధి చేస్తూ సుందరీకరించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ఇటీవల కాగజ్‌నగర్‌కు వచ్చిన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. ఏడాదిలోనే రోడ్డు ప్రమాదాల్లో 28మంది మృతిచెందగా, మరో 67మంది తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. జిల్లాలో రెండు ప్రధాన రహదారులను విస్తరిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చని, ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని గతంలోనూ ఢిల్లీలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్‌తోనూ చర్చించారు. అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. ఇందుకు కేంద్రమంత్రి సుముఖత

చదువులమ్మ కొలువైన బాసర నుంచి భైంసా మీదుగా మహారాష్ట్రలో రేణుకామాత కొలువుదీరిన మహోర్ వరకు హైవేను విస్తరించాలని ఈ ప్రాంతవాసులు చాలాకాలంగా కోరుతున్నారు. ఈ మార్గాన్ని పొడిగిస్తే తెలంగాణతో పాటు మహారాష్ట్రకు చెందిన వేలాదిమంది యాత్రికుల కు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఆధ్యాత్మిక కారిడార్‌గా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఇదివరకే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి దృష్టిని కోరారు. అత్యధికంగా జిల్లావాసులు మహోర్ యాత్రకు ఈ రోడ్డు గుండా వాహనాల్లో వెళ్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని, ఎలాగైనా కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి రహదారిని విస్తరించాలని వినతిపత్రం అందించారు.

మహోర్ వరకు విస్తరిస్తే..

వ్యక్తంచేయడంతో జాతీయ రహదారుల విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఫోర్‌లేన్.. సెంట్రల్ లైటింగ్

హైదరాబాద్‌నుంచి వయా బోధన్–బాసర మీదుగా భైంసా వరకు 161బీబీ జాతీయ రహదారి పనులు కొనసాగుతుండగా పలు మార్పులు చేయాలనే డిమాండ్ ఉంది. బాసర నుంచి ట్రిపుల్‌ఐటీ వరకు, భైంసా నుంచి దేగాం గ్రామం వరకు రోడ్డును మరింత వెడల్పు చేయాలని, ఫోర్‌లేన్‌గా మార్చుతూ డివైడర్, సెంట్రల్ లైటింగ్ లాంటి సుందరీకరణ పనులు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అలాగే, బాసర నుంచి భైంసా మీదుగా మహోర్ వరకు ఈ జాతీయ రహదారిని అనుసంధానం చేసి ఆధ్యాత్మిక మార్గంగా అభివృద్ధి చేయాలని అడుగుతున్నారు. ఇక ఎన్‌హెచ్–61పై తానూరు మండలం బెల్‌తరోడ నుంచి నిర్మల్ వరకు ప్రతీ గ్రామం వద్ద రెండు వైపులా మీటర్ మేరకు విస్తరించాలని, డివైడర్‌ను నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట ఇలా..

జిల్లాలో భైంసా–బాసర ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 30 కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్న ఈ రహదారి నిర్మాణ పనులు రెండేళ్లుగా కొనసాగుతుండగా 80శాతం పనులే పూర్తయ్యాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. భైంసా–నిర్మల్ జాతీయ రహదారి 41కిలోమీటర్ల మేర ఉంది. జిల్లాలో ప్రముఖ క్షేత్రమైన బాసరకు.. మరో క్షేత్రమైన అడెల్లికి వెళ్లేందుకు ఈ మార్గంలోనే వేలాది మంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తారు. జిల్లాకేంద్రానికీ ఇదే ప్రధానమార్గం. ఇలాంటి ఈరోడ్డు రెండు వరుసలకే పరిమితం కావడం, పలుచోట్ల ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రెండు ప్రధాన రోడ్లు విస్తరిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశముంటుంది.

విస్తరిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట



ప్రధాన రహదారులు విస్తరిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. భైంసా మీదుగా రెండు హైవేలున్నాయి. పలు గ్రామాల్లో ఇరుకుగా ఉన్న ఈ రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్లను విస్తరించాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని రెండుసార్లు కలిశాను. వినతిపత్రాలు అందజేశాను. ఈమేరకు ఆయన సానుకూలంగా స్పందించారు.

– రామారావుపటేల్, ముధోల్ ఎమ్మెల్యే

కొనుగోళ్లు సజావుగా సాగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో జరిగిన కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు ప్రక్రియను మరింత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని పేర్కొన్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలుంటే రైతులు 91829 58858 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, సివిల్ సప్లయ్ డీఎం సుధాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీసీవో రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

భారత సేనలకు శక్తినివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై జరుగుతున్న పోరులో భారత సేనకు అనంత శక్తినివ్వాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం స్థానిక గట్టు మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకలపై భీకర దాడులతో భారతశక్తిని ప్రపంచానికి చాటామని చెప్పారు. భారత దాడులకు బెంబేలెత్తిన పాకిస్తాన్ కాళ్ల బేరానికి వచ్చిందని తెలిపారు. కానీ, అంతలోనే తన వక్రబుద్ధిని చూపిందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పేలా భారత సేనకు మరింత శక్తినివ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు రావుల రాము, నాయకులు వడ్నప్ శ్రీనివాస్, తోట లింగురాం, రావుల పోశెట్టి, తుమోల్ల దత్తాత్రి, గాలి రాజు, దిలీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాతృప్రేమ అజరామరం



మాతృదినోత్సవ వేడుకల్లో కవులు, కళాకారులు

నిర్మల్‌ఖిల్లా: సృష్టిలో అన్ని జీవుల్లో కంటే మాతృప్రేమ అజరామరమైందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఆదివారం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని కలం స్నేహం, స్వర స్నేహం సంగీత సాహిత్య సామాజిక సేవాసంస్థల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ జాతీయ ఉపాధ్యక్షురాలు హరిరమణ, ముఖ్య అతిథి నివేదిత హాజరై మాట్లాడారు. మాతృమూర్తులను గౌరవించుకోవడం మన సంప్రదాయమని పేర్కొన్నారు. మలి వయస్సులోనూ వారి ఆలనాపాలన చూసుకోవడం మన బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాతృమూర్తులకు పాదపూజ చేశారు. శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లా కలం స్నేహం అధ్యక్షురాలు దేవిప్రియ, నిర్వాహకులు కడారి దశరథ్, కొండూరు పోతన్న, చిన్నారి నాట్య కళాకారులు ప్రణవశ్రీ, సురక్షి, నందిని, కవులు, కళాకారులు పోలీస్ భీమేశ్, వెంకట్, సుజాత, అనిలా, కవితారాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులకు కొత్త భవనాలు

- మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు నిధులు
- ఒక్కో కోర్టుకు రూ.81 కోట్లు మంజూరు
- ఐదెకరాల చొప్పున స్థలం కేటాయింపు

మంచిర్యాలక్రైం: తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత, జిల్లా న్యాయస్థానాలను కూడా ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలిక భవనాల్లో వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ క్రమంలో న్యాయ నిర్మాణ్ ప్రణాళికలో భాగంగా జిల్లా న్యాయస్థానాలకు కొత్త భవనాల నిర్మాణానికి రూ.81 కోట్లు కేటాయించింది. దీంతో త్వరలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 2004లో కోర్టులు ఏర్పాటయ్యాయి. రెండు దశాబ్దాలుగా అద్దెభవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కోర్టుల సంఖ్య తొమ్మిదికి పెరిగినా సొంత భవనాలు లేకపోవడంతో న్యాయవాదులు, న్యాయమూర్తులు మౌలిక సౌకర్యాల లోపంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది, దీంతో దీర్ఘకాల నిరీక్షణకు తెరపడనుంది.

రూ.162 కోట్లతో ఆధునిక భవనాల నిర్మాణం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో న్యాయ నిర్మాణ ప్రణాళిక కింద కోర్టు భవనాలు నిర్మించనున్నారు. ఇందులో కేంద్రం 60%, రాష్ట్రం 40% నిధులు భరిస్తాయి. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణం కోసం రూ.162 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.81 కోట్లు కేటాయించారు. ఈ భవనాలు నాలుగు అంతస్తులతో, ఒక బేస్మెంట్‌తో ఆధునిక డిజైన్‌లో నిర్మిస్తారు. బేస్మెంట్‌లో 88 కార్లు, 62 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రతీ అంతస్తు 43 వేల నుంచి 44 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తారు. మొత్తం కోర్టు భవనం 2,87,743.58 చదరపు అడుగుల వరకు ఉంటుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు అంతస్తుల నిర్మాణానికి సిద్ధంగా ఉండేలా డిజైన్ చేశారు. ఈ భవనంలో ఫ్యామిలీ, పోక్సో కోర్టులు కూడా ఏర్పాటు చేస్తారు.

2027 నాటికి పూర్తి

కోర్టు భవనాల నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ ఈ నెల రెండో వారంలో ఖరారు కానుంది. టెండర్లు ఖరారైన వెంటనే, పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన 24 నెలల్లో అంటే 2027 నాటికి పూర్తి చేయాలని ఉన్నత న్యాయస్థానం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భవనాలు ఆధునిక సౌకర్యాలతో, తూర్పు అభిముఖంగా, విశాలమైన గాలి, వెలుతురు వచ్చేలా అన్ని సౌకర్యాలతో నిర్మిస్తారు. నిర్మాణానికి సంబంధించిన మోడల్ స్ట్రక్చర్ ఇప్పటికే సిద్ధం చేయబడింది.

నిరీక్షణ ఫలించింది

మంచిర్యాల జిల్లా కాక ముందే స్థానిక అవసరాల దృష్ట్యా పలు కోర్టులు ఏర్పాటయ్యాయి. 2004 నుంచి అద్దె భవనాల్లోనే కోర్టులు కొనసాగుతున్నాయి. సొంత భవనాల కోసం 20 ఏళ్లుగా విన్నవిస్తూ వస్తున్నాం. ఎట్టకేలకు మా నిరీక్షణ ఫలించింది. జిల్లా కోర్టు భవన నిర్మాణానికి రూ.81 కోట్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. కోర్టు భవన నిర్మాణంతో న్యాయవాదులు, కక్షిదారుల సమస్యలు తొలగిపోతాయి.

– బందవరం జగన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల జిల్లా

అడ్మిషన్ల కోసం 'సర్కారు' ప్రచారం



ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను చేర్పించాలని మస్కాపూర్, ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. మస్కాపూర్ పాఠశాలలో 129 మంది విద్యార్థులకు పది పరీక్షల్లో 128 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం నరేందర్‌రావు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 50మందికి పైగా 500కు పైగా, 20 మంది 540కి పైగా మార్కులు సాధించారని అవగాహన కల్పించారు.

కళాశాలలుగా కేజీబీవీలు

- జిల్లాలో 18 కస్తూర్బా పాఠశాలలు
- ఇప్పటికే 12 చోట్ల ఇంటర్ బోధన
- తాజాగా మరో నాలుగింటిలోనూ..
- అందుబాటులోకి మరో 240 సీట్లు
- హర్షం వ్యక్తంజేస్తున్న విద్యార్థినులు

జిల్లా సమాచారం
జిల్లాలోని కేజీబీవీలు: 18
ఇప్పటికే అప్‌గ్రేడ్ అయినవి: 12
తాజాగా అప్‌గ్రేడ్ అయినవి: 4
అందుబాటులోకి రానున్న సీట్లు : 240



సోన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

లక్ష్మణచాంద: పేద, మధ్యతరగతికి బాలికల చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు ఏర్పాటు చేసింది. కార్పొరేట్‌కు దీటుగా బాలికలకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తోంది. కేజీబీవీలు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం కొన్ని పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ వస్తోంది. బాలికలకు ఇంటర్ విద్యను కూడా కస్తూరిబా విద్యాలయాల్లో బోధిస్తోంది. ఈసారి కూడా జిల్లాలోని నాలుగు కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది.

అందుబాటులోకి మరో 240 సీట్లు

జిల్లాలో 18 కేజీబీవీలున్నాయి. ఇందులో ప్రతీ సంవత్సరం కొన్ని జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాయి. ఇప్పటికే జిల్లాలోని 14 విద్యాలయాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. 2025–26 విద్యాసంవత్సరం కూడా నాలుగు కేజీబీవీలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయినట్లు జిల్లా సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ తెలిపారు. ఇందులో సోన్, నిర్మల్ రూరల్, కుభీర్, లోకేశ్వరం కేజీబీవీలున్నాయి. సోన్ కేజీబీవీలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు, నిర్మల్ రూరల్ కేజీబీవీలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు, కుభీర్, లోకేశ్వరం కేజీబీవీల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. నాలుగు కేజీబీవీలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ కావడంతో జిల్లాలో మరో 240 ఇంటర్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. సోన్ కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ లో 40సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 40, నిర్మల్ రూరల్ కేజీబీవీలో ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. కుభీర్, లోకేశ్వరం కేజీబీవీల్లో కంప్యూటర్ సైన్స్‌లో 40 సీట్ల చొప్పున అందుబాటులోకి వస్తున్నాయి.

సంతోషంగా ఉంది



న్యూవెల్మల్ కేజీబీవీ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడం సంతోషంగా ఉంది. కేజీబీవీలో పదో తరగతి పూర్తి చేసిన నేను తిరిగి ఇదే విద్యాలయంలో ఇంటర్ చదివేందుకు దరఖాస్తు చేసుకుంటాను. మాలాంటి పేద విద్యార్థినులకు ఇది ఒక మంచి అవకాశం.

– వెన్నెల, విద్యార్థి, న్యూవెల్మల్

ఇది మంచి అవకాశం



నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యకున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ప్రభుత్వం ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా కేజీబీవీల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సు ప్రవేశపెట్టడం ఆనందంగా ఉంది. నాకు ఇష్టమైన కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరే అవకాశం దక్కింది.

– శివాని, న్యూవెల్మల్

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



సోన్ కేజీబీవీ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంటర్ బోధన ప్రారంభం కానుంది. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాం.

– లతాదేవి, ఎస్వో, సోన్ కేజీబీవీ

సద్వినియోగం చేసుకోవాలి



సోన్, కుభీర్, లోకేశ్వరం, నిర్మల్ రూరల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. అర్హులైన విద్యార్థినులు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. కేజీబీవీల్లో ఇంటర్ పూర్తి చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సలోమి కరుణ, సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

ఆదివాసీలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న రాహుల్ బల్

జన్నారం: ఆదివాసీలను చైతన్యపర్చి రాజకీయంగా ముందుకు తీసుకురావడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బల్ అన్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా ఆదివాసీలు రాజకీయంగా ఎదగలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు రాజకీయంగా ఎదిగేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకురాలు ఆత్రం సుగుణ, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో యువకుడి మృతి


గొంతయ్య (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లికి చెందిన మానెపల్లి గొంతయ్య(18) వడదెబ్బ కు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొంతయ్య..కాగజ్‌నగర్ పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద కూలీ పని వెళ్తున్నాడు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బూరుగూడ పరిధిలోని బీఈడీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం..మండలంలోని జన్కాపూర్‌కు చెందిన అబ్దుల్లా బిన్ సాల్‌హే (42) తనసొంత పని నిమిత్తం కాగజ్‌నగర్‌కు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ కారులో వెళ్తున్నాడు. బీఈడీ కళాశాల సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అతన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు అడ బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నాడు. భార్య ఆస్మాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.

మానవతామూర్తులు

- వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం
- నిరంతరం రోగులకు సేవలు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



వైద్యరంగంలో నర్సులు.. కనిపించే దేవతలు.. సేవామూర్తులు. కాలిన గాయాలతో దవాఖానలకు వచ్చే బాధితులైనా.. రోడ్డు ప్రమాద క్షతగాత్రులైనా.. పురిటినొప్పులతో వచ్చే గర్భిణులైనా.. మరి ఇంకెవరైనా తోబుట్టువులా మొదట పలుకరించేది వాళ్లే. రోగులే దైవంగా సేవలందిస్తూ వైద్య రంగానికే వన్నె తెస్తుండగా, నేడు (సోమవారం) అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
– నిర్మల్‌చైన్‌గేట్/ఆసిఫాబాద్‌అర్బన్


ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్స్(ఫైల్)

ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా
నర్సింగ్ వృత్తికి హుందాతనం తెచ్చిన ఫ్లోరెన్స్ నై టింగేల్ జయంతిని పురస్కరించుకుని ఏటా మే12 న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన కృషిని తలుచుకుంటూ ఏటా వేడుకలు జరుపుకుంటున్నారు. ఈక్రమంలో ఏటా నర్సింగ్ విభాగంలో వి శిష్ట సేవలు అందిస్తున్న నర్సులకు రాష్ట్రపతి అవా ర్డులు అందించి సముచితంగా సత్కరిస్తున్నారు.

నైటింగేల్ స్ఫూర్తితో..



నైటింగేల్ స్ఫూర్తితో విధులు నిర్వహిస్తున్నా. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందిస్తున్నా. ఆపదలో ఉన్న వారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. 2023లో నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్నా.
– విజయలక్ష్మి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

అదృష్టంగా భావిస్తున్నా



నర్సింగ్ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా. నర్సుగా పనిచేస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. రోగులకు సేవ చేయడం కోసం ఈ వృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ ఐదుసార్లు జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ పురస్కారం అందుకున్నా.
– అన్నపూర్ణ, హెడ్‌నర్స్, సీహెచ్‌సీ నర్సాపూర్(జి)

సేవ చేస్తున్నా



రోగులకు సేవ చేయడం దేవుని సేవగా భావిస్తున్నా. కరోనా సమయంలో విధులకు వెనుకాడలేదు. ఆపదలో ఉన్నవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. రోగులందరిని కుటుంబ సభ్యులుగా భావిస్తా. అందుకే రోగం ఎంత భయాంకరమైనదైనా సేవచేయగలుగుతున్నా.
– పుష్పలత, హెడ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఆత్మీయ పలకరింపు



అన్ని ఉద్యోగాలకంటే ఉన్నతమైన వృత్తి నర్సు. వ్యాధి నయమయ్యాక రోగే పిలిచే ఆత్మీయ పలకరింపు గొప్ప ఆనందాన్నిస్తుంది. దీని ముందు ఏదైనా తక్కువే.
భూలక్ష్మి స్టాఫ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఇష్టంతో విధులు



ఆసిఫాబాద్‌అర్బన్: 35 ఏళ్లుగా నర్సింగ్ వృత్తిలో కొనసాగడం గర్వంగా ఉంది. ఇష్టంతోనే విధులు నిర్వహిస్తున్నాం. కుటుంబ సభ్యుల సహకారంతో రోగులకు సేవలందిస్తున్నాం. కరోనా సమయంలో చికిత్స అందించాం. ప్రభుత్వం తమను గుర్తించి పారితోషికం ప్రకటించాలి.
– ఇందుమతి, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

సేవలకు గుర్తింపు



1993లో విధులో చేరాను. మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల్లో ప్రజలకు సేవలు అందించడం తృప్తినిచ్చింది. విధుల్లో రోగులకు సేవ చేయడంతో గుర్తింపు ఉంది. కోవిడ్ బాధితులకు సేవల అందించాను. గ్రామీణులకు సేవ చేయడం సంతోషంగా ఉంది.
– సఫియా బేగం హెడ్‌నర్సు

పారితోషికం ఇవ్వాలి



రాత్రింబవళ్లు రోగులకు సేవలందిస్తున్న నర్సులకు ప్రభుత్వం పారితోషికం అందించాలి. ఆసుపత్రికి వచ్చే వారు మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా మాట్లాడినా వారిని ఓపికతో సర్దిచెప్పి చికిత్స చేసి పంపిస్తాం. ఖాళీల కొరతతో పని భారం పెరుగుతుంది. నర్సు పోస్టులను భర్తీ చేయాలి. మొదట ఆశవర్కర్‌గా పని చేశాను. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ వృత్తిలో చేరాను.
– హేమలత, నర్సింగ్ ఆఫీసర్

తృప్తినిస్తుంది



ప్రతీరోజు రోగులకు సేవ చేయడం తృప్తినిస్తుంది. భర్త ప్రోత్సాహంతో నర్సింగ్ ఉద్యోగాన్ని సాధించాను. అత్యవసర సమయంలో వైద్యం చేసే నర్సులకు ప్రత్యేక పారితోషికాలు ఇవ్వాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – కవిత, నర్సింగ్ ఆఫీసర్

వసతులు కల్పించాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సులకు వసతులు కల్పించాలి. రాత్రివేళ విధులు నిర్వహించేవారికి సెక్యూరిటీ ఇవ్వాలి. ఉన్నతాధికారుల సలహాలతో రోగులకు సేవలందిస్తున్నాం. ఈ వృత్తిలోకి రావడానికి ముందు హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో పనిచేశాను. ఆ అనుభవంతో ఉద్యోగం సాధించాను. – ఆర్.సునీత, నర్సింగ్ ఆఫీసర్

ఎలాంటి ఇబ్బంది లేదు



రోగులకు సేవలు చేయడం అదృష్టంగా భావిస్తాను. ప్రస్తుతం విధ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేదు. ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆదేశాలతో రోగులకు సేవలు చేస్తున్నాను. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. కరోనా సమయంలో పేషంట్లకు సేవ చేయడం జీవితంలో మరువలేనిది. పూర్తిస్థాయిలో వైద్యులు నియమించాలి. – స్రవంతి, నర్సింగ్ ఆఫీసర్

ఆనందంగా ఉంది



పేదలకు వైద్య సేవలందించడం ఆనందంగా ఉంది. గ్రామీణప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడికి ఎంతోమంది వస్తున్నారు. వారిని మా కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేస్తున్నాం. ప్రతీ రోగిపై శ్రద్ధపెడుతూ వైద్యం అందిస్తాం. రేయింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిస్తుంది.
– మంజుల, స్టాఫ్‌నర్స్, ఖానాపూర్

సేవచేసే భాగ్యం



రోగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే. ఆ అవకాశం కేవలం నర్సులకే దక్కుతుంది. రోగులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం దేంట్లో ఉండదు. నర్సింగ్ వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతున్నా.
– కవిత, స్టాఫ్‌నర్సు, భైంసా

ఇష్టంగా వైద్యసేవలు



నర్సుగా విధుల్లో చేరిన ప్పటి నుంచి ఇష్టంగా రోగులకు వైద్యసేవలుఅందిస్తున్నా. అప్పుడే పుట్టిన చిన్నపిల్లలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. నర్సులందరికీ నైటింగేల్ స్ఫూర్తి కావాలి.
– మనీషా, స్టాఫ్‌నర్స్ జిల్లా ప్రసూతి ఆసుపత్రి

అందరికీ అవకాశం దక్కదు



సేవచేయాలన్న కోరిక ఉన్నా అందరికీ ఆ అవకాశం దక్కదు. ఆసుపత్రికి వచ్చేవారిని రోగులుగా కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందిస్తున్నాం. త్వరగా వ్యాధి నయమై వెళ్లాలని కోరుకుంటాం.
– శృతి, జిల్లా ప్రసూతి ఆసుపత్రి

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- రేపే ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 8195 మంది విద్యార్థులు



బెల్లంపల్లి బజారుఏరియా హైస్కూల్ పరీక్ష కేంద్రం

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఉన్న సాంకేతికవిద్య కళాశాలల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13న పాలిసెట్–2025 పరీక్షకు సర్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, వాంకిడి, మంచిర్యాల, బెల్లంపల్లిలో మొత్తం 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 8,195 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్షఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరగనుంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష ఆయా కేంద్రాల్లోకి చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన ఒక్కనిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయానికి ముందస్తుగానే కాలకృత్యాలు తీర్చుకుని రావల్సి ఉంటుంది. మధ్యలో వెళ్లే పరిస్థితి లేదు.

విద్యార్థులు పాటించాల్సిన సూచనలు..
- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, హెచ్‌బీ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్, నీలం లేదా నలుపు బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలి.
- రఫ్ వర్క్ కోసం ప్రశ్నాపత్రంలో చివర రెండు ఖాళీపేజీలు అందుబాటులో ఉంటాయి. బయటి నుంచి కాగితాలు తీసుకురావొద్దు.
- హాల్‌టికెట్‌పై ఫొటోలేని విద్యార్థులు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణపత్రంతో పరీక్షకు హాజరుకావాలి.
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వాచీలు, తదితర తీసుకురావడానికి అనుమతి లేదు.

ప్రశాంతంగా పరీక్ష రాయాలి



విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. పరీక్ష కేంద్రంలో చేతికి ప్రశ్నాపత్రం అందజేసిన తర్వాత ముందస్తుగా సూచనలు చదివి అనుసరించాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. చదివిన అంశాలను గుర్తు చేసుకుని జవాబులు రాస్తే పరీక్షలో నెగ్గడానికి వీలుంటుంది.
– డాక్టర్ ఎం.దేవేందర్, మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	విద్యార్థులసంఖ్య	పరీక్ష కేంద్రాలు
ఆదిలాబాద్	1,102	03
నిర్మల్	2,422	08
కుమురం భీం ఆసిఫాబాద్ (వాంకిడి సెంటర్‌కలుపుకుని)	1,032	04
మంచిర్యాల	2,558	10
బెల్లంపల్లి	1,081	03

ఎన్‌హెచ్‌-44పై దారికాచిన మృత్యువు

- మూడు జిల్లాల పరిధిలో మూడు యాక్సిడెంట్లు
- నిర్మల్ జిల్లాలో తండ్రి, కూతురు దుర్మరణం
- ఆదిలాబాద్ జిల్లాలో బావ మృతి, బావమరిదికి గాయాలు..
- కామారెడ్డి జిల్లాలో భార్య మృతి, భర్తకు గాయాలు
- మూడూ కారు ప్రమాదాలే కావడం విషాదం..

కశ్మీర్ నుంచి కన్యాకుమారిని కలిపే ఎన్‌హెచ్ 44పై ఆదివారం మృత్యువు దారికాచింది. మూడు జిల్లాల పరిధిలో ఇదే రోడ్డుపై జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇక్కడ విషాదం ఏమిటంటే మూడు ప్రమాదాలకు కారణం కార్లే.. మూడు ప్రమాదాలు కారు డ్రైవర్ల తప్పిదంతోనే జరిగాయి. నిర్మల్ బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఆగిఉన్న ఐచర్ వాహనాన్ని కారుడ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తండ్రి, కూతురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బావ మృతి చెందగా, బావమరిది గాయపడ్డాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో కారు అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ మూడు ప్రమాదాలు ఆ కుటుంబాల కలలను, ఆశలను ఛిన్నాభిన్నం చేశాయి.

నిర్మల్ జిల్లాలో..


శంకర్, కృతిక(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్‌కు చెందిన బండి శంకర్(48) బ్యాటరీ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని సంతోషంగా చూసుకునేవారు. ఆయనకు కవల ఆడపిల్లలు వైదిక, కృతిక(22) ఉన్నారు. వైదిక నిజామాబాద్‌లో వైద్య విద్య అభ్యసిస్తుండగా, కృతిక హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కృతిక పరీక్షలు పూర్తి కావడంతో వేసవి సెలవుల కోసం ఇంటికి తీసుకురావడానికి శంకర్ తన సొంత కారులో డ్రైవర్ విలాస్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం రాత్రి కృతికను తీసుకుని ఇంటికి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో నిర్మల్ జిల్లా నీలాయిపేట వద్ద వారు ప్రయాణిస్తున్న కారు, రోడ్డుపై ఆగి ఉన్న ఐచర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. శంకర్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కృతికను స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆమె అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. డ్రైవర్ విలాస్ కాళ్లకు తీవ్ర గాయాలై, చికిత్స కోసం మహారాష్ట్రలోని ఆస్పత్రికి తరలించారు. మరో గంటలో ఇంటికి చేరి, కుటుంబంతో సంతోషంగా గడపాలన్న కృతిక ఆశలు ఈ ప్రమాదంతో ఆవిరయ్యాయి. తండ్రి, కూతురు మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. వారి రోదనలు చూసినవారిని కంటతడి పెట్టించాయి.

ఆదిలాబాద్ జిల్లాలో

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన మరో ప్రమాదంలో వెంకటేశ్(35) మృతిచెందాడు. నిర్మల్ జిల్లా వివేక్‌నగర్‌కు చెందిన వెంకటేశ్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అన్వేష్ బావ, బావమరిది. పని నిమిత్తం శనివారం ఆదిలాబాద్‌కు వెళ్లిన వెంకటేశ్ ఆదివారం బావమరిదితో కలిసి నిర్మల్‌కు బయల్దేరాడు. టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వారి కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్ తీవ్రంగా గాయపడి, నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అన్వేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో..


ప్రణీత మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయర్ ప్రణీత (20) మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కంఠం గ్రామానికి చెందిన అమూల్ నేవీలో విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సెలవులు రద్దు కావడంతో, ఆదివారం సాయంత్రం భార్య ప్రణీతతో కలిసి కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రణీత తీవ్రంగా గాయపడగా, అమూల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ప్రణీత మృతిచెందింది. అమూల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అమూల్, ప్రణీతకు ఏడాది క్రితం పెళ్లయింది.

‘అల్ఫోర్స్’ విద్యార్థులకు అభినందన



కరీంనగర్: ఈఏపీసెట్- 2025 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో సత్తా చాటిన ‘అల్ఫోర్స్’ విద్యార్థులను ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ఆదివారం అభినందించారు.

‘ట్రినిటి’ విజయభేరి



కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో కరీంనగర్ ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934,1104, 1166, 1546, 1619, 1795, 1950తో పాటు మొత్తం 89మందికి పైగా విద్యార్థులు 10వేలలోపు ర్యాంకులు సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ట్రినిటి జూనియర్ కళాశాలలు విద్యా రంగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయని తెలిపారు. ఐఐటీ–జేఈఈ(మెయిన్స్), అడ్వాన్స్‌డ్, నీట్, ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించారని ప్రశంసించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ఈ విజయానికి బాటలు వేసిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

‘శ్రీ చైతన్య’ ర్యాంకుల ప్రభంజనం


జి.వైష్ణవి


బి.మనోఘ్న

కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. గోకులకొండ వైష్ణవి 810, బి.మనోఘ్న 968, బి.సాత్విక్ 1,142, పి.స్ఫూర్తిశ్రీ 1,527, బి.శ్రావణి 1,803, పి.బ్లెస్సీ సుసన్ 2,106, పి.చందన 2165, పి.భరత్‌రెడ్డి 2,815, పి.అజితేష్ 3,016, కె. అనూహ్య 3,503, వి. ప్రవీణ్ 3,623, డి.రిషి 3,996, జి.అర్చన 4,171, ఆర్.శ్రేయాన్ 4,246, వి.శివాణి 4,570, బి.స్రవంతి 4,957, 5000 లోపు 16 ర్యాంకులు, 10000 ర్యాంకుల లోపు 51 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



25 ఏళ్ల తర్వాత మళ్లీ బడికి

దండేపల్లి మండలంలోని ద్వారక జే.వీ.ఎస్ఆర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత అదే బడిలో కలుసుకున్నారు. ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – దండేపల్లి

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం.. కుంటాల మండలం లింబా (బి) గ్రామానికి చెందిన సంజీవ్ (30) ఆదివారం తానూరు మండలం బెంబరలో నిర్వహించిన అంత్యక్రియలు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న ట్రైయినీ ఎస్సై.. ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మద్యం మత్తులో ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.